శేరిలింగంపల్లి ఇన్‌చార్జి డీసీగా సురేష్

శేరిలింగంపల్లి: పటాన్‌చెరు, రామచంద్రాపురం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ.సురేష్‌కు శేరిలింగంపల్లి సర్కిల్‌కు ఇన్‌చార్జి డీసీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి ఈనెల 26వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

వరద కాలువ పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లి రేడియల్ రోడ్డు అండర్‌పాస్‌ను శనివారం ఆయా శాఖల అధికారులు పరిశీలించారు. శుక్రవారం కురిసిన వర్షానికి అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిల్వడంతో ఇరిగేషన్ ఈఈ బీమ్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్అండ్‌బి ఏఈ అజయ్, ఆర్ఐ శ్రీకాంత్‌లు సందర్శించారు. అక్కడే ఉన్న వరద కాలువను వారు పరిశీలించారు. దానిని పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కొండెంగకు చికిత్స

పటాన్ చెరు టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన కొండెంగకు చికిత్స అందించి అటవీశాఖ అధికారులకు అప్పజెప్పిన ఘటన శనివారం పటాన్‌చెరు పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు జాతీయ రహదారిని కొండెంగ దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి రహదారి పక్కనే పడిపోయింది. గమనించిన స్థానికులు పటాన్‌చెరు వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు రావడం ఆలస్యం అవుతుండటంతో సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులకు అప్పజెప్పారు.

ప్రత్యేక పూజలు



పూరీ జగన్నాథుని దర్శించుకున్న అంజిరెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పూరీ జగన్నాథ ఆలయంలో బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూరీ జగన్నాథుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ దంపతులను స్థానిక నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, మేఘనారెడ్డి, స్రవంతిరెడ్డి, అఖిల్,సరిత,పార్టీ కార్యకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన

మూసాపేట: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కూకట్‌పల్లి వై జంక్షన్‌లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ రాష్ట్ర కో కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ.. దాడులు చేసి ఆలయాలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్, సత్యనారాయణ, పావంజి, తిరుపతి, సుదర్శన్, హరి, వినీత్, సాయి, రోహిత్, తేజ, భరత్, కార్తిక్, మురళి, ఉదయ్, మాహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టండి

మణికొండ: హైదరాబాద్ నగరానికి నీటిని సరఫరా చేస్తున్న గండిపేట క్యాండూట్‌కు లీకేజీలు, పైపులు వేసుకుని ఇష్టారాజ్యంగా నీటిని వాడుకుంటున్నా పట్టించుకునే వారు లేరని, దానిని అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శనివారం గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నీటి ట్యాంకర్ల వారు ఫిల్లింగ్ కేంద్రం వద్ద వేగంగా నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారన్నారు. అదే విషయాన్ని జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, బి.బాబు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, సుమనళిని, బి.శ్రీధర్ తదతరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగుల వినతి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో అకడమిక్ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎన్ఆర్‌డీపీఆర్ చెర్మన్, స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు గ్రాంట్ నిలిపివేయడంతో నెలకొన్న ఆందోళనలపై చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించేలా చూడాలని కమిటీ సభ్యులకు వినతి పత్రం సమర్పించారు.

'రన్ ఫర్ జీసస్'ర్యాలీ



చందానగర్: చందానగర్ గంగారంలో పాస్టర్స్ అసోసియేషన్ క్రైస్తవుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్'ర్యాలీని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం మన భారతదేశ గొప్పదనమని అన్నారు. దానిని గౌరవిస్తూ అన్ని మతాల పండుగలకు సమ ప్రాధాన్యమిస్తూ వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమ కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఏసు క్రీస్తు మరణం జయించి తిరిగి లేచిన ఉదంతాన్ని స్మరిస్తూ రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ ర్యాలీని చందానగర్ నుంచి హైదర్‌నగర్ ఫెలోషిప్ చర్చి వరకు నిర్వహించారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏసుపాదం, కేర్ రాజు, కమలాకర్, స్వర్ణలత, శ్రీనివాస్, కేఆర్డివి ప్రసాద్ రావు, సౌందర్య రాజన్, నిఖిల్ పాల్గొన్నారు.

కొండలలో నెలకొన్న కోనేటి..

ప్రేక్షకరంజకంగా అన్నమాచార్య సంకీర్తనల స్వరార్చన



మాదాపూర్: శ్రీసరస్వతీ స్వరాలయం అన్నమాచార్య సంకీర్తనల స్వరార్చన కార్యక్రమం శనివారం మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో జరిగింది. విష్ణుప్రియ అరవింద్ మల్లాది శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను వీనసొంపుగా ఆలపించారు. చిన్నారుల స్వరార్చన కార్యక్రమం ప్రేక్షకరంజకంగా సాగింది. కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు.. అనే కీర్తన ఆలపించి ఆకట్టుకున్నారు. కళాకారులు రాజ్యలక్ష్మి, మంగలక్ష్మి, పల్లవి శ్రావణ్, త్రిపుర సుందరి, తనిష్ఠశ్రీ అరవింద్, ధనుష్‌బాస్కర్, చరిష్మ, హారిని శ్రీనివాసన్, భవిష్య, సుమేధశ్రీ, శ్రీవైష్ణవి, సహస్ర ఇంద్రానిలు మాధవ కేశవ, ఇట్టి ముద్దులాడికి అన్నమాచార్య భావన వాహిని మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్ జ్ఞాపికలను అందజేశారు.

మేము ఎవరికీ తీసిపోము!

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. పేదింటి పిల్లలే అయినా చదువులో తాము ఎవరికీ తీసిపోమని నిరూపించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటచలపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2024-2025 జేఈఈ మెయిన్స్ పరీక్షలో కళాశాల నుంచి మొత్తం 104 మంది హాజరయ్యారు. వారిలో 15 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్ పొందారు. 46 మంది విద్యార్థులు 80 పెర్సెంటైల్, 66 మంది విద్యార్థులు 70 పెర్సెంటైల్‌పైగా సాధించారు.

కళాశాల టాపర్‌గా రంగు మణిదీప్..

మొత్తంలో కళాశాల టాపర్‌గా రంగు మణిదీప్ 99.03 పెర్సెంటైల్‌తో నిలిచారు. కొమ్ము చరణ్‌తేజ్ 98.29తో ద్వితీయ స్థానం, జె.రామ్‌చరణ్ తేజ 98.08 పెర్సెంటైల్, పీఏవీ శ్రీనివాస్ 96.88 పెర్సెంటైల్ సాధించడం విశేషం. కాగా మొత్తం 82 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు.

జేఈఈ మెయిన్స్ సత్తాచాటిన గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు



రంగు మణిదీప్ 99.03



కొమ్ము చరణ్‌తేజ్ 98.29



జె.రామ్ చరణ్ తేజ్ 98.08



పీఏవీ శ్రీనివాస్ 96.88



పి.విజ్వల్‌సింహ 96.64

◆ ప్రిన్సిపల్ కె వెంకట చలపతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుపేద కుటుంబాల నుంచి వచ్చి మంచిగా చదువుకుని జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటారన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదల, అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ఇంతటి ఘన విజయాన్ని సాధించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. ముఖ్యంగా గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, అదనపు కార్యదర్శి సతోషి, అకడమిక్ సంయుక్త కార్యదర్శి సక్రునాయక్, ఓఎస్‌డీ వివేకానంద, స్టేట్ ఆఫీసర్ భీమయ్య అర్హత సాధించిన విద్యార్థులు అభినందించారు. త్వరలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా మంచి ఫలితాలను ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. వంద శాతం మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించడమే ధ్యేయంగా తాము శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన పేదింటి బాలికలు

గౌలిదొడ్డి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి 61 మంది అర్హత



తేజస్విని దొంగ్రే 98.26



భవ్యశ్రీమామిడి 95.75



అక్షర చిక్కా 95.74



నేహలతబైరోజు 93.22



నిహారికా పత్రి 93.03



రూపిక మంగళారపు 90.08

రాయదుర్గం: పేదింటి బాలికలు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ సత్తా చాటారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పి.కల్పన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల బాలికల కళాశాల నుంచి 104 మంది విద్యార్థినులు మెయిన్స్ పరీక్ష రాస్తే అందులో 61 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. అందులో ఆరుగురు 90పెర్సెంటైల్, 20 మంది 80పెర్సెంటైల్, 27 మంది 70పెర్సెంటైల్, 13 మంది 60 పెర్సెంటైల్ సాధించారన్నారు.

◆ కళాశాలలో టాపర్లుగా వరుసగా డి తేజస్విని, భవ్యశ్రీమామిడి, అక్షర చిక్కా, నేహలతబైరోజు, నిహారిక పత్రి, రూపిక మంగళారపు నిలిచారు. గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి,అదనపు కార్యదర్శి సతోషి, అకాడమిక్ సంయుక్త కార్యదర్శి సక్రునాయక్, ఓఎస్‌డీ వివేకానంద, స్టేట్ ఆఫీసర్ భీమయ్య ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా 61 మంది ఐఐటీలో సీట్లు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల సలహాలతో అధ్యాపకులు, విద్యార్థినులు సమష్టిగా కృషి చేసేలా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన రెసోనెన్స్ విద్యార్థులు



మాదాపూర్‌లోని రెసొనెన్స్ కళాశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న డైరెక్టర్ పూర్ణచంద్రరావు

మాదాపూర్: దేశవ్యాప్తంగా జరిగిన ప్రతిష్టాత్మక పరీక్షలలో రెసోనెన్స్ అద్భుత విజయం సాధించిందని రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. మాదాపూర్‌లో శనివారం ఆలిండియా జేఈఈ మెయిన్స్‌లో విజయం సాధించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ఇతర మెడికల్ పరీక్షలలో అగ్రశ్రేణి ర్యాంకులను సాధించడంలో ముందంజలో ఉన్నామన్నారు. హైదరాబాద్ రెసోనెన్స్ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో 100 పర్సెంటైల్ సాధించారన్నారు. 57 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్, 285 మంది విద్యార్థులు విభిన్న సబ్జెక్టులలో 99సాతం పర్సెంటైల్ పైగా సాధించినట్టు తెలిపారు. ఘన విజయం సాధించిన విద్యార్థులను సన్మాణించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



హఫీజ్‌పేట్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో నిమ్మల రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, రంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఈనెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిమ్మల రామకృష్ణ గౌడ్, వాలా హరిష్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, జమీర్, రవీందర్‌రెడ్డి, శేఖర్ గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గాంధీ, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఆల్విన్‌కాలనీ: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన విభాగం, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కూకట్‌పల్లి, మాధవరం నగర్ కమ్యూనిటీ హాలులో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తలసీమియా చిన్నారుల కోసం అత్యధిక యూనిట్లను సేకరించిన సంస్థగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, కామారెడ్డి రక్తదాలత సమూహం ఆవిర్భవించిందన్నారు. నేటి వరకు 2400 యూనిట్ల రక్తాన్ని అందజేసిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర నాయకులు కాపర్తి నాగరాజు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కార్పొరేటర్ రోజాదేవి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్, యూత్ అధ్యక్షులు కట్ట రవికుమార్, తెరల శ్రీనివాస్, దొంతుల అన్నయ్య పాల్గొన్నారు.

27న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 27న నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఆరో తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఆన్లైన్లో telangana.cff.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌లో శనివారం కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్ ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రూ. 25 లక్షల వ్యయంతో అభివృద్ధి పను లు జరుగుతున్నాయన్నారు. బోరు, షెడ్డు, గదుల మరమ్మ తులు, కాంపౌండ్ వాల్ పెయింటింగ్, గ్రిల్స్, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే సహకారంతో జరుగుతున్నాయని తెలిపారు.

గాలిదుమారానికి ఒరిగిన భారీ విద్యుత్ స్తంభాలు



గోపన్‌పల్లితాండ నుంచి గోపన్‌పల్లి వెళ్లే రోడ్డులో ఒకవైపు ఒరిగిపోయిన భారీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు

రాయదుర్గం: గాలితో కూడిన వర్షంతో గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో భారీ హైటెన్షన్ భారీ విద్యుత్ స్తంభాలు రెండు రోడ్డుపైకి ఒక్కసారిగా ఒరిగిపోయాయి. శనివారం సాయంత్రం గోపన్‌పల్లితాండ కూడలి నుంచి గోపన్‌పల్లివైపు వెళ్లే మార్గంలో గాలి, వర్షానికి అకస్మాత్తుగా ఒక్కసారిగా రెండు హైటెన్షన్ భారీ విద్యుత్ స్తంభాలు రోడ్డుపైకి ఒరిగిపోయాయి. అసమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపైకి ఒక్కసారిగా శబ్దం చేస్తూ స్తంభాలు ఒరిగిపోవడంతో అందరూ భయాందోళనలకు గురయ్యారు. ఘటన జరిగిన విషయం తెలిసిన వెంబడే విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతు చర్యలు ఆరంభించారు. స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉన్న వైపు రోడ్డుపై రాకపోకలు సాగకుండా పక్కనుంచే వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. వాహనదారులు కూడా ప్రమాదం పొంచి ఉన్న చోటును గుర్తించి వాహనాలను నడపుకుంటున్నారు.



నేడూ ఆస్తిపన్ను చెల్లించొచ్చు: డీసీ

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 20వ తేదీతో పాటు 27వ తేదీన ఆదివారం సందర్భంగా కార్యాలయంలో ఈ కౌంటర్ పని చేస్తుందన్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీమ్‌ను ప్రకటించిందన్నారు. ఈ స్కిమ్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయతీ పొందాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాజేంద్రనగర్‌సర్కిల్ కార్యాలయంతో పాటు వార్డు కార్యాలయాల వద్ద ఆస్తిపన్నులు స్వీకరిస్తారన్నారు. బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఆస్తిపన్నును వసూలు చేస్తారన్నారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ ఆస్తిపన్నును చెల్లించవచ్చునని కోరారు.

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

మియాపూర్: ఆన్‌లైన్ యాప్‌లలో రుణాలు తీసుకుని షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోవడంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, పెద్ద దగడ గ్రామానికి చెందిన జింకల గణేష్(23) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆన్‌లైన్ యాప్స్, క్రెడిట్ కార్డులలో లోన్లు తీసుకుని షేర్ మార్కెట్‌లలో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. అదే విధంగా మెడ్‌ల్యాబ్ కంపెనీలో పనిచేస్తున్నానని ఓ మహిళా ఫోన్ చేసి కంపెనీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా లక్ష రూపాయల ఫోన్‌ను రూ.25వేలకే ఉద్యోగులకు ఇస్తున్నామని గణేష్‌కు కాల్ చేసి చెప్పింది. దీంతో గణేష్ రూ.25వేలు కట్టడమే కాకుండా తొమ్మిది మంది స్నేహితులతో రూ.25వేల చొప్పున కట్టించాడు. కొన్ని రోజుల తర్వాత సదరు మహిళ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది.

◆ దీంతో గణేష్ స్నేహితులు డబ్బుల ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తండ్రి భరత్, బావమరిది ఆంజనేయులు కలిసి ఆ స్నేహితులకు డబ్బులు కట్టారు. ఆన్‌లైన్ యాప్‌లో లోన్లు కూడా మెడకు చుట్టుకోవడంతో గణేష్ శనివారం ఉదయం ఇంట్లో తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు గణేష్ ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందికి దించి మియాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫోన్లు ఇప్పిస్తానని డబ్బులు కట్టించుకుని మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి భరత్‌కుమార్ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యాటక ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

లాట్వియా విడ్జెమ్ యూనివర్సిటీ ప్రొ. అగితా లివినా



గచ్చిబౌలిలోని నిథమ్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో భారత, లాత్వియా, పోర్చుగల్ ప్రముఖులు, రాష్ట్ర పర్యాటక, నిథమ్ ఫ్యాకల్టీ, అధికారులు

రాయదుర్గం: పర్యాటక ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని లాట్వియాలోని విడ్జెమ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ప్రొఫెసర్ అగితా లివినా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్'లో శనివారం 'ఇంటర్నేషనల్ అకాడమిక్ కొలాబరేషన్ ఎన్హాన్సెస్ టూరిజమ్ కరికులమ్'అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. అగితా లివినా మాట్లాడుతూ.. పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తేనే ఉపాధి అవకాశాలు పెంచడానికి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. అంతేకాకుండా ప్రపంచ భాగస్వామ్యాలు, నైపుణ్య అభివృద్ధి, భాగస్వామ్యం ప్రాముఖ్యతను బలోపేతం చేశాయన్నారు. పర్యాటక విద్యలో నిథమ్ నాయకత్వ పాత్రలో బలోపేతం చేయడానికి ఈ వర్క్‌షాప్ దోహద పడిందన్నారు.

◆ నిథమ్ డైరెక్టర్ హనుమంతు కొండిబా మాట్లాడుతూ... పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యాటక, ఆతిథ్య రంగాలలో పాఠ్యాంశాలు, స్థిరమైన సేవా పద్ధతుల అవసరాన్ని గుర్తించాలన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేలా విద్యాబోధన, నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకునేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక, ఆతిథ్య రంగాలు రెండూ భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడటం ఖాయమని అన్నారు. ఈ

◆ నేపథ్యంలో పర్యాటక, ఆతిథ్య సిలబస్‌ను రూపొందించాలని సూచించారు. 4 ఉన్నత విద్యాసంస్థలు, 5 అనుబంధ భాగస్వాములతో కూడిన ప్రాజెక్టు ఎస్ఐపీఏఎస్ వినూత్న అధ్యయన మాడ్యూళ్ల అభివృద్ధి, పంపిణీని నొక్కిచెబుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో స్థిరమైన పర్యాటకం, ఆతిథ్యం, సేవలలో సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, ఈయూ బాహ్యవిద్యా విధానాలకు దోహదపడటమే లక్ష్యమన్నారు. క్లిష్టమైన నైపుణ్యాల ఆలోచన ద్వారా పర్యాటక రంగ ఉపాధిని మెరుగుపర్చడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

◆ ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు పోతుకూచి త్రయంబకం, సంపదకుమార్, దుర్గేజ రబ్రసిల్, నిథమ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, డాక్టర్ నీరజ్‌గో హిల్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డితో పాటు భాకద, లాత్వియా, పోర్చుగల్ దేశాలకు చెందిన పర్యాటక, ఆతిథ్యరంగాల ప్రముఖులు, నిథమ్ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.